క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు



యోగాలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

లింగపాలెం : ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా తరగతులు సోమవారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. కథలు చదివించడం, రాయించడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి సీహెచ్‌వీ రమణ, చింతపండు – జామ పండు కథను వివరించారు. కె.సోను స్పోకెన్ ఇంగ్లిష్‌పై, ఏవీ నారాయణ గణితంపై, శ్రీను మాస్టారు యోగాలో విద్యార్థులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

చింతలపూడి : వెంకటాద్రిగూడెం నాయకులపేటలో ఇటీవల పిడుగు పడి ఇల్లు దగ్ధమైన వి.రాఘవరావు కుటుంబానికి మానవత ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. సోమవారం మానవత సంస్థ సభ్యులు నాయకుల పేటను సందర్శించి త్సల్లాబత్తుల అప్పన్న దొర అందించిన రూ.10 వేల నగదును బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, కోచైర్మన్ ముప్పిడి శామ్యూల్, అధ్యక్షుడు కాండ్రేగుల నాగ చిన్నారావు, కార్యదర్శి అన్నవరపు రాజారావు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో షటిల్ పోటీలు



షటిల్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

జంగారెడ్డిగూడెం : రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజనోత్సవాల్లో చిన్నారులకు షటిల్ పోటీలు నిర్వహించారు. స్థానిక కాలేజ్ రోడ్‌లోని షటిల్ కోర్టులో 7 నుంచి 15 సంవత్సరాల వయసులోపు చిన్నారులకు ఈ పోటీలను నిర్వహించినట్లు రోటరీ కార్యదర్శి ఉడా రాంగోపాల్, కార్యదర్శి (ఎలక్ట్) బవిరిశెట్టి హనుమాన్ తిలక్, సభ్యులు కనుపర్తి లక్ష్మీనరసింహ ధనకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సాహంగా చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాల పంపిణీ

పెదపాడు: మండలంలోని సత్యవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులను సోమవారం నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు ఇంగ్లిషు, గణితం, జనరల్ నాలెడ్జ్ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. సత్యవోలు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌స్పైర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ క్రీస్తుప్రకాశ్ సహకారంతో ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఘంటా పద్మశ్రీ ప్రసాదరావుతో పాటు ఎస్ కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగారావు, సొంగల ఉమామహేశ్వరరావు, వైకుంఠపు ధనుంజయ్ సహకారంతో నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయుడు ఖండవల్లి పురుషోత్తం తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెదవేగి : సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పెదవేగి మండలం అమ్మపాలెంలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న నిమ్మ, కొబ్బరి, జామ తదితర పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. కష్టపడి పండిస్తున్న నిమ్మకాయలకు కనీస ధరలు రాక నష్టపోతున్నామంటూ రైతులు రైతు సంఘం నాయకుల వద్ద వాపోయారు.నిమ్మ రైతు కొఠారు చంద్రరావు నిమ్మ తోట పరిశీలించగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న నిమ్మకాయలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం లేదని నిమ్మ రైతు చెప్పారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని ప్రభుత్వం ఒకవైపు ప్రోత్సహిస్తోందని, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో తగిన గిట్టుబాటు ధరలు రాక సాగు చేస్తున్న రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిలో నిమ్మకాయలకు మార్కెట్‌లో కేవలం రూ.15 మాత్రమే ధర వస్తోందని చెప్పారు. కూలీ ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా రైతుకు రావడం లేదన్నారు.. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందు సత్తిబాబు, కొఠారు చంద్రరావు పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని 8వ వార్డులో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని ఎమ్మెల్యే చదివి వినిపించారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలే స్వయంగా చెప్పడం సంతోషంగా ఉందన్నారు. కోలా దుర్గారావు అనే వ్యక్తి ఉమ్మడి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు రూ.32 లక్షల లబ్ధి చేకూరడంతో ఆ కుటుంబం కళ్లలో ఉండే ఆనందమే జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందచేస్తాయని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పేదలు నేరుగా లబ్ధి పొందేలా చేయలేదని అన్నారు. తమ ఎస్సీ పేటలో నిరంతరం విద్యుత్ కోతలు, హెచ్చు తగ్గులు ఉండడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆ వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే ఆయన స్పందించి విద్యుత్ సమస్య లేకుండా ఆ వార్డులో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేయించాలని విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్బారావుకు ఆదేశించారు. తొలుత మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, 8వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి) ఎమ్మెల్యే ఎలీజాకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, ఏలూరు జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, నాయకులు మేడవరపు విద్యాసాగర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, కౌన్సిలర్లు నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గా ప్రసాద్, సంకు సురేష్, తడికమళ్ళ మురళి కృష్ణ, దొంతు మాధవ్, బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ జిలానీ, బత్తిన చిన్నా, కేమిశెట్టి మల్లిబాబు, గూడపాటి రాధా కృష్ణ, కంచర్ల విష్ణు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యం కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : భార్య, ఆమె కుటుంబ సభ్యులు దౌర్జన్యం చేసి తనను, తన తల్లిని చంపుతానని బెదిరించారని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం పంగిడిగూడెం రోడ్‌లో నివాసం ఉంటున్న జోగి వీరబాబుకు, దాక్షాయణితో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. వివాహమైన నాటినుంచి భార్య దాక్షాయణితో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె దెందులూరు మండలం పోతునూరులో పుట్టింటి వద్దే ఉంటోంది. మార్చి 3వ తేదీన దాక్షాయణి, మరికొందరు కలిసి వీరబాబు ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి ఇంట్లోని సామాగ్రి ధ్వంసం చేయడంతో పాటు, వీరబాబును, అతని తల్లిని చంపుతానని బెదిరించారన్నారు. సోమవారం వీరబాబు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

దెందులూరు: ఉండ్రాజవరంలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన నాగవంశీయుల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం ఒకొక్కరికి రూ.10 వేలు అందజేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కాలా శ్రావణ్ కుమార్ తెలిపారు. ఇందుకోసం విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. తన తండ్రి కాలా నర్సింహరావు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సేవలకు ప్రోత్సాహం

- ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సత్కారం
- పోలవరం నియోజకవర్గంలో 1459 మంది అవార్డులకు ఎంపిక
- నేడు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా పురస్కారాల అందజేత



లక్ష్మడుగూడెంలో సేవలందిస్తున్న సేవారత్న అవార్డు అందుకోనున్న వలంటీరు మాధవి

బుట్టాయగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లు వారధిలా నిలుస్తున్నారు. పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు చేరవేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. వలంటీరు వ్యవస్థ ఏర్పడిన నాటినుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం గత మూడేళ్ల నుంచి ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు, సత్కారాలతో ప్రోత్సహిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయలకు అనుంధానంగా పనిచేస్తున్న వలంటీర్ల పనితీరు ఆధారంగా నగదు పారితోషకంతో పాటు సర్టిఫికెట్లు, బాడ్జీలు, మెడల్స్ అందిస్తోంది. ఈ ఏడాది కూడా వలంటీర్లకు వందనం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు నగదు పురస్కారాలు, సత్కారాలు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గంలో 1459 మంది పురస్కారాలకు ఎంపిక

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నర్సాపురం మండలాల పరిధిలోగల సచివాలయల్లో పని చేస్తున్న సుమారు 1459 మంది వలంటీర్లు అవార్డులకు ఎంపికయ్యారు. మండలాల వారీగా బుట్టాయగూడెం మండలంలో 225 మంది, జీలుగుమిల్లిలో 151 మంది, కొయ్యలగూడెంలో 383 మంది, కుక్కునూరులో 181 మంది, వేలేరుపాడులో 83 మంది, టి.నర్సాపురంలో 219 మంది, పోలవరంలో 217 మంది చొప్పున వలంటీర్లను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు అవార్డుల అందజేత

ఉత్తమ సేవలు అందించి అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు మంగళవారం బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద అవార్డుల ప్రదానోత్సవం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా మధ్యాహ్నం 3 గంటలకు ఈ అవార్డులు అందజేయనున్నారు.

హర్షణీయం



గిరిజన మారుమూల గ్రామాల్లో సేవలు అందిస్తున్న మాలాంటి వారిని ప్రభుత్వం గుర్తించడం చాలా సంతోషంగా ఉంది. మాకు అవార్డులు ఇస్తూ ప్రోత్సహించడం వలంటీర్లల్లో మరింత ఉత్సాహం నింపుతుంది. ఈ ఏడాది నేను సేవా వజ్రం అవార్డుకు ఎంపికయ్యాను.

– సోడెం మారమ్మ, వలంటీరు, లక్ష్మడుగూడెం సచివాలయం, బుట్టాయగూడెం మండలం

బాధ్యతలు చేపట్టిన అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలలో నూతన అధ్యాపకులు బాధ్యతలు చేపట్టినట్లు పాఠశాల హెచ్‌ఎం గ్లోరీ ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఈ పాఠశాలలో ఇంటర్మీడియేట్ బోధన ప్రారంభించగా బైపీసీ, సీఈసీ గ్రూపులలో విద్యాబోధన జరుగుతుందన్నారు. 10వ తరగతి పూర్తయిన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్లోరీ ప్రశాంతి కోరారు. ఇంటర్ అడ్మిషన్‌లు, ఇతర వివరాలకు 99483 90202, 92905 23167 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కేబుల్, ఇంటర్నెట్ వైర్ల ధ్వంసంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న జంగారెడ్డిగూడెం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని తమకు చెందిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఎస్సై ఎం.సాగర్‌బాబుకు సోమవారం లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 30 ఏళ్లగా కేబుల్, 10 ఏళ్లగా ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో తమ సంస్థకు చెందిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. దీనివల్ల వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున వైర్ల ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువు భూమి ఆక్రమణ



బయ్యనగూడెం రామకోనేరు చెరువు భూమిని ఆక్రమించి కట్టిన కట్టడం

కొయ్యలగూడెం : బయ్యనగూడెం రామ కోనేరు చెరువు ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 40 సెంట్ల భూమి ఆక్రమణలకు గురైంది. తాజాగా సుమారు నాలుగు సెంట్ల చెరువు గర్భంలోని భూమిని ఆక్రమించి కట్టడం కూడా నిర్మించడం జరిగింది. అక్రమ కట్టడం అని తెలిసి కూడా పంచాయతీ కుళాయి కలెక్షన్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. చెరువు భూమిని ఆక్రమించారంటూ ఇటీవల పంచాయతీ నోటీసులు జారీ చేసి వెంటనే ఖాళీ చేయాల్సిందిగా అధికారులు ఆదేశాలు జారీ చేశారని స్థానికులు కొందరు పేర్కొన్నారు. 20 ఏళ్లగా నివాసం ఉంటున్న తమను ఖాళీ చేయమని ఒకపక్క నోటీసులు ఇస్తూనే మరోపక్క అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వడం ఏంటి అంటూ ప్రశ్నించారు. పంచాయతీకి చెందిన కొందరు ప్రజా ప్రతినిధులు మామూళ్ల మత్తులో పడి అవినీతికి పాల్పడుతున్నారని కొందరిని ఖాళీ చేయించాలని అంటూనే మరికొందరికి ఇళ్ల నిర్మాణానికి పరోక్షంగా అనుమతులు ఇస్తున్నారు అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేసి ఆక్రమణలు తొలగించాలంటూ స్థానికులు కోరుతున్నారు.

అమ్మవారికి జాతర పొన్నులు



పొంగుటూరులోని ఒక నివాసంలో గంగానమ్మ అమ్మవారికి పొన్నులు (గరగలు) వేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామదేవత గంగానమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు సోమవారం సంప్రదాయపరమైన పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి తమ నట్టింట్లో పొన్నులు వేసి అమ్మవారిని సేవించారు. జాతర ఉత్సవాలలో అత్యంత ముఖ్యమైనది పొన్నులు పరచడం. పొన్నులు వేయడం వల్ల ఆ కుటుంబం పిల్లాపాపలతో, పశుసంపదతో, సుఖసంతోషాలతో ఐశ్వర్యంతో తులతూగుతుందని ప్రజల విశ్వాసం. నులక మంచంపై నూతన వస్త్రాన్ని కప్పి దానిపై కొత్తగా పండిన ధాన్యాన్ని పోస్తారు. అలా పోసి ఉంచిన ధాన్యం మీద అమ్మవారి ప్రతిరూపంగా భావించే గరగలను కుండలను ఉంచి పూజలు నిర్వహించి తమ స్థాయిని బట్టి నైవేద్యాలు సమర్పిస్తారు. గ్రామానికి సంబంధించి కుల మతాలకు అతీతంగా ఎవరు ఈ కార్యక్రమం చేపట్టినా అమ్మవారిని ఆ ఇంటికి తీసుకు వెళ్లడం జరుగుతుంది. ఈసందర్భంగా ఇంటింటికి వస్తున్న గంగానమ్మ వారికి స్థానికులు జలాభిషేకం నిర్వహించి ధూప దీప పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవాలలో ప్రధానంగా, అమ్మవారికి సేవనందించడంలో అగ్రవర్ణాల వారితో సమానంగా శూద్రులు, పంచములనబడే వర్గాలవారు కీలకంగా వ్యవహరించడం జాతర విశిష్టత అని, ఏగ్రామ జాతరలోనైనా వివక్షతకు తావులేని సమ సమాజాన్ని చూపించినట్లు అవుతుందని ఇది అనాదిగా వస్తున్న ఆచారం అని గ్రామ పెద్దలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నాయకులు

జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి జంగారెడ్డిగూడెం డివిజన్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. సోమవారం ఏపీజేఏసీ అమరావతి పిలుపు మేరకు ఉద్యోగుల వేదనను చెబుదాం అనే కార్యక్రమాన్ని జేఏసీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఎలీజా ఉద్యోగుల ప్రధాన సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రెసిడెంట్ కె.రమేష్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే ఏబీసీడీ వర్గీకరణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు

చింతలపూడి : మహాజన సోషలిస్ట్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త చవటపల్లి విజయమాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు సోమవారం గ్రామాల్లో 50 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి రాజారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ కొలికిపాము హైమావతి అధ్యక్షతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయమాదిగ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో మహిళా సమన్వయకర్త సౌజన్య, జీలుగుమిల్లి మండల సయన్వయకర్త మల్లిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసిన దృశ్యం

కామవరపుకోట : విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల విద్యాశాఖ అధికారి డి సుబ్బారావు అన్నారు. సోమవారం స్థానిక సోషల్ వర్కర్స్ టీం వారి ఆధ్వర్యంలో మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో 500 పైబడి మార్కులు సాధించిన 18 మంది విద్యార్థిని విద్యార్థులను స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో సత్కరించి నగదు పారితోషకం, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తును సాధించాలన్నారు. కామవరపుకోట పరిసర ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్న సోషల్ వర్కర్స్ టీంని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్, రావికంపాడు హెచ్ఎం భీమరాజు, హిందీ మాస్టర్ నాగరాజు, టీవీఎస్ రాజు, షేక్ ఇబ్రహీం, మల్ల రాజు, చింతపల్లి ఎలేషా, సోషల్ వర్కర్స్ టీం సభ్యులు వీరమల్ల మధు, నిజపరపు దుర్గాప్రసాద్, మున్నంగి శ్రీనివాస్, మేడంకి రాజారావు, పండూరి రామ సాయి, సౌజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్త విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): భారతీయ సాహిత్యంలో తెలుగు కథను ఉన్నత శిఖరానికి చేర్చిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి మరణం సాహిత్య లోకానికి తీరని లోటని సాహితీ స్రవంతి ఏలూరు జిల్లా కన్వీనర్ కడలి రామాంజనేయులు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతుని, తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సాహిత్య ప్రస్థానం మాసపత్రికలో అనేక కథలు, వ్యాసాలు అందించిన వ్యక్తి విశ్వనాథరెడ్డి అని గుర్తు చేశారు. అభ్యుదయ రచయితల ఉద్యమంలో విశాలాంధ్ర ప్రచురణలో కీలక బాధ్యతలు నిర్వహించారని, పాఠ్యపుస్తకాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయం వేదనలకు అక్షర రూపమివ్వడంలో ఆయనది గొప్పముద్ర అని రామాంజనేయులు కొనియాడారు.

రామాలయానికి మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్‌ను అందజేసిన వీహెచ్‌పీ సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం గ్రామంలో అరుంధతీపేటలో ఇటీవల నిర్మించిన నూతన శ్రీ కల్యాణ రామాలయానికి జంగారెడ్డిగూడెం విశ్వహిందూ పరిషత్ సభ్యులు మైక్‌సెట్ బహుకరించినట్లు పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో భక్తులచే సత్సంగం కార్యక్రమం నిర్వహించి ఆలయ కమిటీకి మైక్‌సెట్ అందించారు. సత్సంగం, భజనల ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం, ధార్మిక శక్తి పెరుగుతుందని సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంకాల వెంకట్, శ్రీనివాస్, సతీష్, గాంధీ, బంగారు, పార్వతి, నాగమణి, వీహెచ్‌పి సభ్యులు కె.దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, విశ్వనాథ్, తిప్పాభట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూట్ కార్మికులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): చట్ట విరుద్ధంగా ఏలూరు జూట్ మిల్లును మూసివేశారని, కార్మికులకు రావాల్సిన పరిహారాలు చెల్లించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనే యాజమాన్య వైఖరిని నిరసిస్తూ స్థానిక కొత్తూరు జూట్‌మిల్లు వద్ద సోమవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జూట్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని, కార్మికులకు రావాల్సిన రాయితీలు చెల్లించాలని, యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని నినదించారు. ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 25న బహిరంగ సభ ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

కుకునూరు : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సకాలంలో పరిహారం చెల్లించకుండా కాలయాపన చేయడం తగదని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య పేర్కొన్నారు. కుకునూరులో సోమవారం నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో పరిహారాలు ఇవ్వకుండా నిర్వాసితుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. 2013 భూసేకరణ చట్టం పేరుకే అన్నట్లు ఆ చట్టాన్ని ఎక్కడా అమలు చేయడం లేదని, ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో అతి తక్కువ ధరలకు భూసేకరణ చేశారని అదే ప్రాజెక్టు కింద కుడి ఎడమ కాలువలకు ఇక్కడ కంటే మూడు రెట్లు ఎక్కువ పరిహారం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికీ కూడా అశాస్త్రీయ సర్వేల ప్రకారం ముంపు ప్రాంతాలను గుర్తించాలని, మెరకలో ఉన్న వాటిని ముంపులో ఉన్నట్లు, పల్లంలో ఉన్న ప్రాంతాలను ముంపులో లేనట్లుగా చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో ముంపులో ఉన్న రైతులు పరిహారం అందక లబోదిబోమంటున్నారని అన్నారు. మండలాన్ని యూనిట్‌గా భూ సేకరణ చేసి రైతులకు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ముంపు ప్రాంతాల గురించి త్వరలోనే సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, సహాయ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబూరావు, ఐతం సురేష్, రైతు సంఘం జిల్లా నాయకులు కృష్ణ, ప్రసాద్, బల్ల కనకదుర్గారావు, వరసా పాపారావు, వరసా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలంటూ వినతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన వేతన ఎరియర్స్ తాలూకా సొమ్ము చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సోమవారం నగర కమిషనర్ వెంకట కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ సిబ్బందికి బకాయి పడిన వేతనాల ఎరియర్స్‌లో కొంత భాగం ఏప్రిల్‌లో చెల్లించినందుకు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. జూన్‌లో విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమవుతున్న దృష్ట్యా మిగతా ఎరియర్స్ ఉద్యోగ సిబ్బందికి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.